క్లుప్తంగా

జడ్జిని కలిసిన ఏఎస్పీ


జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసు శాఖలో ఇటీవల ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌రాజు సోమవారం పలువురు జిల్లా అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గ్రీవెన్స్ పరిష్కారానికి కృషి


కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాబూ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చారు. బర్త్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని, దారి సమస్యలు, వివిధ భూ సమస్యలను పరిష్కరించాలంటూ 23 అర్జీలు వచ్చాయి. గ్రీవెన్స్ సమస్యలను పరిష్కరించేందుకు ఆయా రెవెన్యూ వీఆర్‌ఓలు చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్క్రీనింగ్ పరీక్షలు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: నగరంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. ఆయన సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వయసున్న విద్యార్థులకు పుట్టుకతో వచ్చే వ్యాధులు, పోషకాహార లోపంపై స్క్రీనింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ వివరాలను అధికారులకు పంపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, సహాయ కమిషనర్ ప్రసాద్, సీడీపీవో సునంద పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

చిత్తూరు అర్బన్: ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టే, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలకు వెంటనే ఇళ్ల స్థలాల మంజూరుపై దృష్టి పెట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని 47వ డివిజన్ సచివాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా అధ్యక్షులు నాగరాజన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు నివాస భవనం కోసం భూమిని ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఆ మేరకు మాట నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రమాదేవి, మణి, దామోదరం, చాంద్‌బాషా, లతారెడ్డి పాల్గొన్నారు.

పంప్ ఆపరేటర్‌పై దాడి


తీవ్రంగా గాయపడిన రామకృష్ణ

బంగారుపాళెం: మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ పంప్ ఆపరేటర్‌పై ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరచినట్లు పోలీసులు తెలిపారు. జంబువారిపల్లెకు చెందిన రామకృష్ణ పంచాయతీలో పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రామకృష్ణపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా కొట్టి కొత్తపల్లె ఫ్లైఓవర్ సమీపంలోని మామిడి తోట పక్కన పడేసి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రామకృష్ణను చికిత్స నిమిత్తం బంగారుపాళేనికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. పంప్‌ఆపరేటర్‌పై ఎవరు దాడి చేశారు? ఎందుకు దాడి చేశారు అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

నిర్లక్ష్యపు రెవెన్యూ



స్థానిక సంస్థలు బలోపేతమయ్యేది ఆర్థిక వనరులతోనే. పుష్కలంగా నిధులు ఉంటే ప్రజలకు సరైన వసతులు కల్పించవచ్చు. అందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. కార్పొరేషన్‌కు బలమైన ఆర్థిక వ్యవస్థ అయిన రెవెన్యూ విభాగం సక్రమంగా పనిచేయడం లేదు. అధికారుల్లో నిర్లిప్తత నెలకొంది. ఎక్కడి ఫైళ్లు అక్కడే ఆగిపోవడంతో ఆదాయానికి గండిపడుతోంది.

- కొత్త భవనాలకు ఆస్తి పన్ను మదింపులో నిర్లక్ష్యం
- పేరుకుపోయిన పన్ను, పేరు మార్పు దరఖాస్తులు
- పన్ను వసూళ్లపై దృష్టి పెట్టని అధికార యంత్రాంగం
- చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ దుస్థితి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బలమైన ఆర్థిక వ్యవస్థ రెవెన్యూ విభాగం. రెండు నెలలుగా ఆ విభాగంలో నిర్లిప్తత నెలకొంది. కొందరు అధికారులు సక్రమంగా పనిచేయకపోవడంతో కార్పొరేషన్‌కు ఆదాయం పెరగడం లేదు. వస్తున్న ఆదాయమూ రాకుండాపోతోంది.

ప్రక్షాళన జరిగినా...

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగాన్ని ప్రస్తుత కమిషనర్ ఇప్పటికే ప్రక్షాళన చేశారు. ఈ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను (ఆర్‌ఐ), గుమస్తాను బదిలీ చేశారు. వీరి స్థానంలో మరో ఆర్‌ఐను నియమించడంతో పాటు రెవెన్యూ అధికారి-2 అనే పోస్టులో మరో సీనియర్ అసిస్టెంట్‌కు పగ్గాలు ఇచ్చారు. అయినప్పటికీ ఆస్తి పన్నుల వసూళ్లపై అధికారులు పెద్దగా దృష్టి పెట్టడంలేదనే విమర్శలున్నాయి. ఓ ఆర్‌ఐ కోసం ప్రజలు కార్యాలయానికి ఎప్పుడు వచ్చినా అందుబాటులో ఉండడం లేదు. ఇదేమిటని అడిగితే, తనకు కోర్టు డ్యూటీలు ఎక్కువగా ఉన్నాయని నిట్టూరుస్తున్నారు. మరో ఆర్‌ఐ తనకు కేటాయించిన విధులు చూడకుండా, ఇతర పనులు చూస్తున్నారనే విమర్శలున్నాయి. వీళ్లను పర్యవేక్షిస్తే సహాయ కమిషనర్ ఉన్నప్పటికీ ఫలితం లేదు. ఎలాంటి పనులూ జరగకపోవడంతో ఆదాయానికి గండిపడుతోంది.

పెండింగ్‌లో వందలాది ఫైళ్లు

రెవెన్యూ విభాగానికి ప్రజలు ఎక్కువగా ఆస్తిపన్నులు చెల్లించడంతో పాటు ఓ ఆస్తిని కొనుగోలు చేసినప్పుడు పన్నును తమ పేరిట మార్చుకోవడం (టీటీపీ) కోసం వస్తుంటారు. అలాగే కొత్తగా భవనాలు నిర్మించుకున్న వాళ్లు ఆస్తిపన్ను నంబర్ (అసెస్‌మెంట్) తీసుకోవడానికి కార్పొరేషన్ కార్యాలయానికి వస్తుంటారు. కొందరు సచివాలయాల్లోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పిస్తుంటారు. రెవెన్యూ విభాగానికి ఇప్పటి వరకు ప్రజల నుంచి దాదాపు 470 వరకు దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది. వీటిని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. ఒక్కసారి ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తును 14 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. కొందరు సిబ్బంది 13 రోజులైనా దాన్ని పట్టించుకోకుండా, చివరి రోజున ఏదో ఒక సాకు చూపిస్తూ దరఖాస్తును రిజెక్ట్ చేస్తున్నారు. దీనికి అసలు కారణం మాత్రం.. సంబంధిత సిబ్బంది అడిగినంత డబ్బులు దరఖాస్తుదారుడు ఇవ్వకపోవడమనే ఆరోపణలున్నాయి. వందలాది ఫైళ్లను సిబ్బంది వారి లాగిన్‌లో పెండింగ్‌లో ఉంచుకోవడం, ప్రజల్ని కార్యాలయం చుటట్టూ తిప్పించుకోవడం ఇటీవల అలవాటుగా మారిపోయింది.

చర్యలు తీసుకుంటాం



రెవెన్యూ విభాగంలో నెలకొన్న పరిస్థితి నా దృష్టికి కూడా వచ్చింది. కొత్తగా ఆస్తిపన్ను విధించడంపై కొందరు నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిసింది. ఇప్పటికే ఆ విభాగపు అధికారులతో సమీక్షించాను. సంస్థను బలోపేతం చేయాల్సిన వాళ్లు, వచ్చే ఆదాయాన్ని కూడా పోగొడుతున్నారంటే ఊరుకునేదిలేదు. దీని పర్యవసానం చాలా సీరియస్‌గా ఉంటుంది. ఆస్తి పన్ను వసూళ్లపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాను. అందరికీ లక్ష్యాలు కేటాయించి, కార్పొరేషన్ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టి చేయాలని ఆదేశించాను.

– నరసింహప్రసాద్, కమిషనర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్

కార్మికులకు న్యాయం చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమకుమార్, రాష్ట్ర అదనపు కార్యదర్శి రూప్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న విజయవాడ విద్యుత్ సౌధలో హెచ్‌ఆర్ కమిటీ సమావేశం జరుగుతోందన్నారు. అందులో తమ డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను గతంలో తమ సమస్యలపై కలిసినప్పుడు తెలంగాణ, తమిళనాడులో విధానాలను పరిశీలించి న్యాయం చేస్తానని హామీనిచ్చిన విషయం గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో విద్యుత్ కార్మికులకు రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం వచ్చాక విద్యుత్ యాజమాన్యం హెచ్‌ఆర్ కమిటీ సమావేశం మొదటిసారి నిర్వహిస్తోందన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ కార్మికుల రెగ్యులేషన్‌కి వేసిన కమిటీ నివేదికను పరిశీలించాలన్నారు. ప్రమాద భీమాతో పాటు ఆరోగ్య పాలసీ, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

శాస్త్రోక్తంగా చండీహోమం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని దుర్గానగర్ కాలనీలో వెలసిన శ్రీ సర్వసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష హోమాది పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. కార్యక్రమంలో సభ్యులు పార్థసారథి నాయుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వినతులు పరిశీలించి న్యాయం చేయండి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: తమ వినతులు పరిశీలించి న్యాయం చేయాలని పలు ప్రాంతాల అర్జీదారులు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారుల వినతులను పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

భూమి ఆక్రమించుకున్నారు



మాది పూతలపట్టు మండలం వావిల్‌తోట గ్రామం. ఖాతా నెంబర్ 684 సర్వే నెంబర్ 1119లో 3.52 ఎకరాల భూమి నా పేరు మీద ఉంది. ఆ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. సర్వే చేయించి హద్దులు చూపించాలని అధికారులను కోరాను. అయినా స్పందించడం లేదు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాను.

– చక్రపాణి

వితంతు పింఛన్ అందించాలి



నేను చిత్తూరు నగరం ఇరువారంలోని సీబీఎస్ కాలనీలో నివాసం ఉంటుంటాను. వితంతు పింఛన్ మంజూరు కోసం ఎన్ని సార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో పింఛన్ ఇచ్చేవారు. ఆధార్ లింక్ లేదని పింఛన్ ఇవ్వడం మానేశారు. న్యాయం చేసి పింఛన్ తిరిగి మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరాను.

–కుమారి

అక్రమంగా కూసాలు నాటారు



నేను పెనుమూరు మండలం పాపిరెడ్డిపల్లి నుంచి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చాను. మా పొలానికి వెళ్లే దారిలో అన్యాయంగా కూసాలు నాటేశారు. చార్యగానిపల్లిలో రెండు ఎకరాలు ఉంది. తమ పొలానికి వెళ్లే బండిబాట, నీటి కాలువను దౌర్జన్యంగా నాశనం చేసి ఇనుప కూశాలను నాటారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దాడి చేసేందుకు వస్తున్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

–ఇరగమ్మ

ఇళ్లకు వెళ్లేదారిని ఆక్రమించుకుంటున్నారు



మాది చిత్తూరు రూరల్ తుమ్మింద పాళ్యం గ్రామం. మా తుమ్మిందపాళ్యం ఎస్‌టీ ఆర్ కాలనీలో 10 కుటుంబాలు నివస్తున్నాయి. మా ఇళ్లకు వెళ్లే దారిలో కొబ్బరి మొక్కలు నాటి ఆక్రమించుకుంటున్నారు. ఎందుకు ఇలా చేస్తున్నారని అడిగితే దాడికి దిగుతున్నారు. పరిశీలించి మాకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాం.

–శివకుమార్

కొత్త రేషన్ కార్డు ఇప్పించండి



మాది చిత్తూరు మండలం తుమ్మింద పాళ్యం. నా భర్త అనిల్ కుమార్‌కు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో వెన్నెముక విరిగింది. అప్పటి నుంచి నడవలేక మంచానికే పరిమితమయ్యారు. దివ్యాంగుల పింఛన్‌కు దరఖాస్తు చేయాలంటే రేషన్ కార్డు అడుగుతున్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాను.

–వెన్నెల

భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు




కాణిపాకం: దీపారాధన చేస్తున్న భక్తులు, తవణంపల్లె: ఉసిరిచెట్టు కింద దీపారాధన చేస్తున్న భక్తులు, బంగారుపాళెం: విశేషాలంకారంలో సిద్ధేశ్వరస్వామి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మూడవ కార్తీక సోమవార పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు. సుందరమయంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులు ఉసిరి చెట్టు కింద పిండి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కార్తీక దీపారాధన

చిత్తూరు నగరంలో సోమవారం కార్తీక సోమవార పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చిదంబరేశ్వరస్వామి ఆలయం, అగస్త్యేశ్వరస్వామి ఆలయం, నాగేశ్వరస్వామి ఆలయం, కుళందీశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం, సాయంత్రం అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి దీపారాధన చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరి రాకతో ఆలయాలు కిటకిటలాడాయి.

మొగిలి శివాలయంలో..

బంగారుపాళెం: మండలంలో దక్షిణకాశిగా పేరుగాంచిన మొగిలి శివాలయంలో తెలుగు కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు శివాలయం ముందు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దేవరకొండపై వెలసిన పార్వతీ సమేత జలకంఠేశ్వరాలయం, మండలంలోని చీకూరుపల్లె సిద్ధేశ్వరాలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. కార్తీక సోమవారం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందీశ్వరునికి భక్తితో పూజలు

తవణంపల్లె: మండల కేంద్రంలోని శ్రీ కాలభైరేశ్వర ఆలయంలో సోమవారం భక్తులు కార్తీక మాసం పూజలు నిర్వహించి దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో మూలవిరాట్ కాలభైరేశ్వరునికి అభిషేకం, పూజలు చేసి ధూపదీప నైవేద్యం సమర్పించారు. శివలింగానికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. నందీశ్వరునికి దీపాలు వెలిగించి భక్తితో పూజలు చేశారు. ఆలయంలో ఉసిరిచెట్టు, రావిచెట్టు కింద దీపాలు వెలిగించి పూజలు చేసి దీపారాధన చేసి మొక్కులు చెల్లించారు.

నేడు జాబ్‌మేళా

నగరి: పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఫెయిల్ లేదా పాస్, బీటెక్ చేసిన, 18 నుంచి 30 వయస్సులోపు యువతీయువకులు అర్హులని తెలిపారు. మరిన్ని విరాలకు 63009 54441, 99635 61755, 95731 04593 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించుకుందాం



నగర వనంలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ కేడెట్లు

చిత్తూరు కలెక్టరేట్: ప్రతి ఎన్‌సీసీ కేడెట్ నిత్య జీవితంలో ఖచ్చితంగా మొక్క నాటి సంరక్షించడం అలవాటు చేసుకోవాలని 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోనిష్ అన్నారు. నగరంలోని అటవీ శాఖ నగరవనంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. ప్రతి కేడెట్ మొక్క ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. అనంతరం కేడెట్ల ఆధ్వర్యంలో ఒక్కొక్క మొక్కను నాటించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్ రెడ్డి, ఈశ్వర్‌రావు, యుగంధర్, మహేష్‌రాయ్, మస్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు పఠనం అలవాటు చేసుకోవాలి


చిత్తూరు: సర్వసతీదేవికి పూజ చేస్తున్న రచయితలు

బంగారుపాళెం: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు వక్తృత్వ, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు తమ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. విజేతలకు ఈ నెల 20వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సుశీల, పీఈటీ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానవంతులు

ఐరాల: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులు కావాలని ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారిణి సుజాత అన్నారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు పోటీతత్వం ఉండాలని చెప్పారు. పోటీతత్వం ఉన్నప్పుడే వారిలో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: తెలుగుభాష గొప్పతనం తెలియాలంటే సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని రచయిత హరికృష్ణారెడ్డి తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సాహిత్య సదస్సులో మాట్లాడారు. పుస్తకాలు మనిషి జీవితాన్ని ఉన్నత స్థానంలో తీసుకురావడానికి దోహదపడుతుందన్నారు. మానసిక ఉల్లాసానికి ఉపయోగపడుతుందని చెప్పారు. భాష గొప్పతనం గురించి విశాంత్ర అధ్యాపకులు శ్రీహరినాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడారు. అనంతరం రచయితలను సన్మానించారు. కార్యక్రమంలో సావిత్రమ్మ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఉషారాణి, రచయితలు మొగిలయ్య, గోవిందస్వామి, జెనీఫర్, డిప్యూటీ లైబ్రేరియన్ లలిత తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న విద్యార్థులు, ఐరాల: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కనకదాసు జయంతి వేడుకలు


వేడుకల్లో జెడ్పీ చైర్మన్, కలెక్టర్, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: చిన్న వయసులోనే కనకదాసు అనేక కవితలు, కీర్తనలు రచించారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం భక్త కనకదాసు జయంతి వేడుకలు నిర్వహించారు. కనకదాసు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన కనకదాసు ఆధునిక కవి, తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త తదితర బిరుదులు పొందారని చెప్పారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ కనకదాసు చిన్న వయసులోనే నరసింహ స్తోత్రం, రామధ్యాయ మంత్రం, మోహన తరింగిణి కవిత్వాలను రచించారన్నారు. తన సైనిక వృత్తిని విడిచిపెట్టి, తత్వజ్ఞానాన్ని పామరులకు అర్థమయ్యేలా సంగీత సాహిత్యాలతో కూర్చి అందించేందుకు తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో కె.మోహన్ కుమార్, డీఈఓ వరలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ బాషా, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, ఈడీ బీసీ కార్పొరేషన్ శ్రీదేవి, జిల్లా ఉపాధి కల్పనా అధికారి పద్మజ, డీపీఓ పార్వతి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత దూరమవుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 50 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య సిబ్బంది అందజేసే ఐరన్ మాత్రలతోపాటు ఆకు కూరలు, పాలు, గుడ్లు, చిక్కీలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు బీపీ, షుగర్, యూరిన్ పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.